క్లుప్తంగా

కాంగ్రెస్‌లో చేరికలు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న శంకర్‌

కేశంపేట: ఇప్పలపల్లి గ్రామంలో బుధవారం పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్‌ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌ నుంచి పలువురు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా పిప్పిళ్ల వెంకటేశ్‌ తదితరులకు ఆయన పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌ నాయకులు యాదయ్యయాదవ్‌, జగదీశ్వర్‌, వీరేశ్‌, శ్రీధర్‌రెడ్డి, యాదయ్య, శ్రీనాథ్‌ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ హామీలను ఎవరూ నమ్మరు

బీజేపీ నియోజకవర్గం నాయకుడు విజయ్‌కుమార్‌



మాట్లాడుతున్న విజయ్‌కుమార్‌

చేవెళ్ల: రాష్ట్రంలో అడ్డగోలు హామీలతో ప్రజలను మోసం చేసేందుకు కాంగ్రెస్‌ ప్రయత్నం చేస్తోందని బీజేపీ నియోజకవర్గం నాయకుడు విజయ్‌కుమార్‌ అన్నారు. బుధవారం చేవెళ్లలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్‌ ప్రజలను మోసం చేసేందుకే ఆచరణ సాధ్యం కానీ హామీలను గుప్పిస్తోందన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం దిగజారుడు రాజకీయం చేస్తోందని మండిపడ్డారు. మండల ప్రధాన కార్యదర్శి అనంత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు క్రిష్ణగౌడ్‌, బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్‌ శ్రీనివాస్‌రెడ్డి, శంకర్‌పల్లి మండల అధ్యక్షుడు రాములుగౌడ్‌, షాబాద్‌ అధ్యక్షుడు కిరణ్‌కుమార్‌, దళిత మోర్చా అధ్యక్షుడు అశోక్‌, బీజేవైఎం టౌన్‌ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక నిమజ్జనం



వినాయకుని ఊరేగింపులో పోలీస్‌ సిబ్బంది, చిన్నారులు

షాబాద్‌: షాబాద్‌ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసుకున్న వినాయకుడి నిమజ్జనం బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఎస్‌ఐ మహేశ్వర్‌రెడ్డి రూ. 25వేలకు లడ్డును వేలంలో దక్కించుకున్నాడు. గ్రామంలో పురవీధుల గుండా వినాయకుడి ఊరేగింపు చేశారు. అనంతరం స్టేషన్‌ ఆవరణలో అన్నదానం నిర్వహించారు. గణేశ్‌ మహరాజ్‌కీ జై అంటూ శోభయాత్ర నిర్వహించారు. నృత్యాలు, కోలాటం, డప్పుల వాయిద్యాల మధ్య వినాయకుడిని షాబాద్‌ పహిల్వాన్‌ చెరువులో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ యాదయ్యగౌడ్‌, ఎస్‌ఐలు మహేశ్వర్‌రెడ్డి, రాజేందర్‌, ఏఎస్‌ఐ రామ్‌లాల్‌, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తా

ఎమ్మెల్యే కాలె యాదయ్య



ఎమ్మెల్యేతో ముదిరాజ్‌సంఘం నాయకులు

చేవెళ్ల: నియోజకవర్గంలో ముదిరాజ్‌ సంఘం నాయకులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. బుధవారం చేవెళ్లలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాలె యాదయ్యను నియోజకవర్గంలోని ముదిరాజ్‌సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు తమ సమస్యలను ఎమ్మెల్యేతో మొర పెట్టుకున్నారు. ముఖ్యంగా ముదిరాజ్‌ సంఘం భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని వారు కోరారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని చెప్పినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్‌సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సలీమ్‌ పటేల్‌ కుటుంబానికి పరామర్శ

కొందుర్గు: మాజీ మండలపరిషత్‌ కోఆప్షన్‌ సభ్యులు తుమ్మలపల్లి సలీమ్‌ పటేల్‌ కొన్ని రోజులుగా హైదరాబాద్‌లోని ఓ ప్రయివేట్‌ ఆసుపత్రిలోచికిత్స పొందుతూ బుధవారం మధ్యాహ్నం మృతిచెందారు. ఈ సందర్భంగా పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్‌, షాద్‌నగర్‌ ఎమ్మెల్యే తనయుడు మురళీయాదవ్‌ తుమ్మలపల్లి గ్రామాన్ని సందర్శించి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారికి అండగా ఉంటామన్నారు.

పత్తిసాగు.. ఆశాజనకం



షాబాద్‌: బొబ్బిలిగామలో ఏపుగా పెరిగిన పత్తి మొక్కలు

- పూత, కాత దశకు చేరిన పంట
- వరదలతో కొన్ని చోట్ల నష్టం
- జిల్లాలో దాదాపు 3.50 లక్షల ఎకరాల్లో సాగు

షాబాద్‌: రెండేళ్లుగా నష్టాలు చవిచూస్తున్న రైతులు ఈ ఏడాది పత్తి పంటపైనే గంపెడాశలు పెట్టుకున్నారు. ప్రస్తుతం మొక్కలు ఏపుగా పెరిగి పూత, కాత దశకు చేరుకోవడంతో దిగుబడి అనుకున్న రీతిలో వస్తుందని ఆశిస్తున్నారు. పత్తితీత సమయంలో అకాల వర్షాలు లేకుంటే నాణ్యమైన పంట చేతి కొచ్చే అవకాశం ఉందని అన్నదాతలు పేర్కొంటున్నారు. గతేడాది పత్తి క్వింటాలుకు రూ.10వేలకు పలికిన నేపథ్యంలో తెల్లబంగారం లాభాలు తీసుకొస్తుందని ధీమాతో వారు ఉన్నారు.

జిల్లాలో పత్తిసాగు అధికం...

జిల్లా వ్యాప్తంగా రైతులు ఏటా పత్తి పంటే అధికంగా సాగు చేస్తారు. ఆ తర్వాత వరి, మొక్కజొన్న పంటలు పండిస్తారు. జిల్లాలోని 27 మండలాల్లో పత్తి పంటకే ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ వానాకాలం దాదాపు 3.50 లక్షల ఎకరాల్లో పత్తి పంట సాగవుతుంది.

ఏపుగా పెరిగిన మొక్కలు...

ప్రస్తుతం పత్తి మొక్కలు ఏపుగా పెరిగి పూత, కాత దశకు చేరుకుంది. కొన్ని చోట్ల చీడపీడల ఉధృతి ఉండటంతో రైతులు క్రిమిసంహారక మందులు ఉపయోగించి పంటను కాపాడుకుంటున్నారు. పూత కాత దశలో వర్షాలు అధికంగా పడితే తెగుళ్ల సోకే ప్రమాదం ఉంది. నేలలో తేమ ఉండడంతో రైతులు మూడోసారి కింది ఎరువులు యూరియా, పోటాష్‌ వేస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు సైతం తెగుళ్ల, గులాబీ రంగు పురుగు నివారణకు క్షేత్రస్థాయిలో పర్యటించి అవగాహన కల్పిస్తున్నారు. ముఖ్యంగా గులాబీ రంగు పురుగు ఉధృతిని గుర్తించేందుకు లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని సూచిస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం నాలుగేళ్ల కింద లింగాకర్షక బుట్టలపై సబ్సిడీ ఎత్తివేయడంతో రైతులపై భారం పడుతోంది.

లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలి



పూత, కాత దశలో పత్తి పంటను గులాబీ రంగు పురుగు దాడి చేసే ప్రమాదం ఉంది. పూత నుంచి కాయలోకి ప్రవేశించి కాయను తొలచివేస్తుంది. గులాబీ రంగు పురుగు నివారణకు చేలలో లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలి. సస్యరక్షణ చర్యలపై సలహాలకు మండల వ్యవసాయ అధికారులను సంప్రదించాలి.

– గీతారెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

- అభివృద్ధి పనులను వేగవంతం చేయండి
- ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌

కొందుర్గు: కొందుర్గు మండల పరిషత్‌ కార్యాలయంలో ఎంపీపీ పోతురాజు జంగయ్య అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. మండల వైద్యాధికారి డాక్టర్‌ అమ్రిత జోసెఫ్‌ మాట్లాడుతూ మహిళల ఆరోగ్యానికి ప్రతీ మంగళవారం ఆరోగ్య మహిళతో ఉచితంగా మెరుగైన చికిత్స అందిస్తున్నామన్నారు. జిల్లా ఉద్యానవన శాఖ ఏఓ మంజుల మాట్లాడుతూ ఆయిల్‌పామ్‌ సాగుపై ప్రభుత్వం అందించే సబ్సిడీని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తిచేయాలని ఇందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌ సూచించారు. గ్రామాల్లో మిషన్‌ భగీరథ పథకం ద్వారా సరఫరా చేసే నీరు చాల స్వచ్ఛమైనదని, వాటిని దుర్వినియోగం చేయొద్దన్నారు. ఎవరైనా నల్లాలకు చెర్రాలు తీసినట్లయితే చర్యలు తీసుకోవాలన్నారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు పూర్తయ్యే దశకు చేరిందన్నారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ రాగమ్మ, వైస్‌ ఎంపీపీ రాజేష్‌పటేల్‌, పీఏసీఎస్‌ చైర్మన్‌ దామోదర్‌ రెడ్డి, ఎంపీడీఓ ఆంజనేయులు, తహసీల్దార్‌ రమేష్‌ కుమార్‌, ఎంపీఓ లాలయ్య, ఎంఈఓ కిష్టారెడ్డి పాల్గొన్నారు.

మహిళా సంఘాల బలోపేతానికి కృషి

కందుకూరు: మహిళా సంఘాల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తుందని జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, డీఆర్‌డీఏ ఏపీడీ జంగారెడ్డి అన్నారు. బుధవారం మండల మహిళా సమాఖ్య సర్వసభ్య సమావేశాన్ని అధ్యక్షురాలు కుంచెం కవిత అధ్యక్షతన నిర్వహించారు. ఆర్థిక సంవత్సరంలో విజయాలు, గ్రూప్‌లకు అందించిన బ్యాంక్‌ లింకేజ్‌ రుణాలు, ఉపాధి కల్పన తదితర విషయాలను వివరించారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.7.12 లక్షల లాభం వచ్చినట్లు అధ్యక్షురాలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మహిళా సంఘాలు ఆర్థికంగా ఎదిగితే కుటుంబాలు, తద్వారా గ్రామాలు, దేశం బాగుపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో డీపీఎం ఐబీ స్వర్ణలత, ఎంపీడీఓ వెంకట్రాములు, ఏపీఎం కవిత, ఏపీపీ రవీందర్‌ రెడ్డి, సమాఖ్య కార్యదర్శి రేవతి పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ జాప్యం తగదు



దీక్షకు మద్దతు తెలుపుతున్న రామస్వామి

చేవెళ్ల: ఎస్సీ వర్గీకరణ జాప్యం తగదని, వర్గీకరణ ప్రకియను జాప్యం చేస్తూ 75 ఏళ్లుగా ఏక పక్షంగా దోచుకుంటున్న దోపిడీ దారులకు బీజేపీ కొమ్ముకాస్తోందని మహాజన సోషలిస్టు పార్టీ (ఎంఎస్‌పీ) చేవెళ్ల నియోజకవర్గం ఇన్‌చార్జి శంకర్‌రావు మాదిగా అన్నారు. తహసీల్దార్‌ కార్యాలయం ఎదుట రెండో రోజు ఎమార్పీఎస్‌ జిల్లా ఉపాధ్యక్షుడు కాడిగల్ల ప్రవీణ్‌కుమార్‌ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష కొనసాగించారు. ఈ దీక్షకు శంకర్‌రావు మాదిగతోపాటు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామస్వామి, న్యాయవాది బాలక్రిష్ణ, మోరి బుచ్చయ్య, కందవాడ మాణిక్యంలు పాల్గొని మద్దతు తెలిపారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్‌ జిల్లా కార్యదర్శి శివశంకర్‌, నాని భానుప్రసాద్‌, వెంకటేశ్‌, మహేందర్‌, శ్రీనివాస్‌, తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి ప్రత్యేక చర్యలు

ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌

షాద్‌నగర్‌: నిరుపేదల ఆరోగ్యానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌ పేర్కొన్నారు. షాద్‌నగర్‌ పరిధిలోని లింగారెడ్డిగూడలో నిర్మిస్తున్న ఏరియా ఆసుపత్రి ఆవరణలో దిశ్య శక్తి ఇండియా ప్రయివేటు లిమిటెడ్‌ పరిశ్రమ వారి సౌజన్యంతో రూ.1.50 కోట్లతో నిర్మిస్తున్న డయాలసిస్‌ కేంద్రానికి బుధవారం ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డయాలసిస్‌ రోగుల కోసం అత్యాధునిక హంగులతో ఏర్పాటు చేసేందుకు దిశ్యశక్తి పరిశ్రమ ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. గతంలో ఈ ప్రాంతంవారు డయాలసిస్‌ చేయించుకునేందుకు హైదరాబాద్‌ వెళ్లాల్సి వచ్చేదన్నారు. షాద్‌నగర్‌ ప్రభుత్వ ఆసుపత్రిలో ఆరు యంత్రాలతో డయాలసిస్‌ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మరిన్ని వసతులతో కూడిన మరో కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు వారు తెలిపారు. కార్పొరేట్‌ ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్‌ చైర్మన్‌ కొందూటి నరేందర్‌, వైస్‌ చైర్మన్‌ ఎంఎస్‌ నటరాజన్‌, సర్పంచ్‌ భీష్వ మాధవి, ఎంపీటీసీ భీష్వ రామకృష్ణ, కౌన్సిలర్‌ కానుగు అంతయ్య తదితరులు పాల్గొన్నారు.

గణనాథుడికి పూజలు..

పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన గణనాథుడికి ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌ బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వంకాయల నారాయణ రెడ్డి, ఎంఎస్‌ నటరాజన్‌, మన్నె నారాయణ, చెట్ల నర్సింహా, నరహరి, గుడ్డు యాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.

అందని పౌష్టికాహారం

- ఇబ్బందుల్లో అంగన్‌వాడీలు
- పక్కదారి పడుతున్న సరుకులు
- పట్టించుకోని ఉన్నతాధికారులు



బాలింతలతో వార్డు అధికారులు

శంకర్‌పల్లి: అయ్యప్పరెడ్డిగూడ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు, బాలింతలకు అందాల్సిన పౌష్టికాహారం మూడు సంవత్సరాలుగా అందడం లేదని కాలనీ వాసులు వాపోయారు. బుధవారం శంకర్‌పల్లి మున్సిపల్‌ వార్డు అధికారులు సత్యయ్య, వినోద్‌, శంకరయ్య, చంద్రశేఖర్‌లు అయ్యప్పరెడ్డిగూడ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. కాలనీలోని బాలింతలను, గర్భిణులను పిలిపించుకొని వారు వివరాలు సేకరించారు. మూడు సంవత్సరాలుగా కోడి గుడ్లు, కంది పప్పు, నూనె, బాలామృతం, పాలు తదితర పౌష్టికాహారం పంపిణీ చేయడంలేదనే విషయం తెలిసింది. ఈ విషయంలో వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో 25ట్రేల గుడ్లు, నూనె, మురుకులు తదితర పౌష్టికాహార పదార్థాలు నిలువ ఉండటంతో వాటిని అక్కడికి వచ్చిన బాలింతలకు, పక్కనే ఉన్న ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ విషయమై ఉన్నాతాధికారులకు నివేధిక అందజేస్తామని వారు పేర్కొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం పోలెపల్లి, సింగంపల్లి, చెన్నంపల్లి, కొత్తకుంటతాండలలో సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌ను పోలెపల్లి ఎంపీటీసీ సభ్యులు దోనాదుల కుమార్‌ కోరారు. బుధవారం హైదరాబాద్‌లో జైపాల్‌యాదవ్‌ను కుమార్‌, సింగిల్‌విండో వైస్‌ చైర్మన్‌ సత్యం, కొత్తకుండతాండ ఉపసర్పంచ్‌ జాన్యానాయక్‌ తదితరులు కలిశారు. ఈ సందర్భంగా సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు లాలయ్య, నారయ్య, శ్రీరాములు, వెంకటయ్య, యాదయ్య, అంజయ్య, భీమ్లానాయక్‌, యాదయ్యగౌడ్‌, కృష్ణయ్య, శేఖర్‌, సైదులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న గణనాథుల పూజలు



మొయినాబాద్‌రూరల్‌లో



కొత్తూరు: హనుమాన్‌ ఆలయంలో పూజలు

మొయినాబాద్‌రూరల్‌: మండల పరిధిలోని గ్రామాల్లో గణనాథుల పూజలు కొనసాగుతున్నాయి. మూడో రోజు బుధవారం అమ్డాపూర్‌, నక్కలపల్లి, తోల్‌కట్ట, చిన్నమంగళారం, అజీజ్‌నగర్‌, బాకారం, కాశీంబౌలి, ముర్తుజాగూడ, కనకమామిడి ఆయా గ్రామాల్లోని గణనాథులను భక్తులు దర్శించుకుంటున్నారు. ఉదయం, సాయంత్రం పూజలు నిర్వహిస్తున్నారు. అనంతరం పులిహోర, స్వీట్లు పంపిణీ చేస్తున్నారు.

కొత్తూరులో..

కొత్తూరు: పట్టణంలోని హనుమాన్‌ ఆలయంలో భజన మండలి ఆధ్వర్యంలో స్థానిక నాయకులు, ప్రజలు దర్శించుకున్నారు. అనంతరం వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

- బీజేపీ సీనియర్‌ నేత శ్రీవర్ధన్‌రెడ్డి
- 33 శాతం రిజర్వేషన్లు హర్షణీయం

కొత్తూరు: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా బీజేపీ ప్రభుత్వం దేశ వ్యాప్తంగా పాలన సాగిస్తుందని బీజేపీ సీనియర్‌ నేత శ్రీవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించడం హర్షణీయమని అన్నారు. బుధవారం ఇన్ముల్‌నర్వ గ్రామంలో మహిళలు, పలువురు నాయకులతో కలిసి ప్రధానమంత్రి నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు కేవలం మహిళలకు రిజర్వేషన్లు కల్పిస్తామని హామీలు గుప్పించారని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాణిక్యం, రమేష్‌, గణేష్‌, మహేష్‌, శ్రీకాంత్‌, ప్రశాంత్‌, బుచ్చిబాబు, లింగం నాయక్‌ తదితరులు పాల్గొన్నారు.

మొయినాబాద్‌లో..

మొయినాబాద్‌: పార్లమెంటులో మహిళా బిల్లు ప్రవేశపెట్టి, ఆమోదం పొందిన సందర్భంగా మహిళా మోర్చ ఆధ్వర్యంలో మొయినాబాద్‌ మండల కేంద్రంలో ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఆ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంజర్ల ప్రకాశ్‌, రాష్ట్ర కౌన్సిల్‌ మెంబర్‌ సన్‌వెల్లి ప్రభాకర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, మహిళా మోర్చ మండల అధ్యక్షురాలు, రెడ్డిపల్లి సర్పంచ్‌ వినిత, జిల్లా కార్యదర్శి జుంజురు శోభ, తదితరులు పాల్గొన్నారు.



కొత్తూరు: మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం



మొయినాబాద్‌లో క్షీరాభిషేకం

ఆరోపణలు అవాస్తవం

శంకర్‌పల్లి: లలిత ఆసుపత్రిపై వస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని ఆసుపత్రి డాక్టర్‌లు అరవింద్‌కుమార్‌, భరత్‌ కుమార్‌ స్పష్టం చేశారు. బుధవారం ఆసుపత్రిలో వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. తాము పేదలకు న్యాయంగా మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ఓ దిన పత్రికలో (సాక్షి కాదు) వచ్చిన వార్తను తాము ఖండిస్తున్నామన్నారు. పూర్తి వైద్యం చేయకుండా మొత్తం డబ్బులు వసూలు చేసినట్లు తప్పుడు రాతలు ఎలా రాయిస్తారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

ట్రాఫికర్‌

రోడ్లపైనే వాహనాల పార్కింగ్‌

- పెరుగుతున్న రద్దీ
- అలంకారప్రాయంగా సిగ్నల్‌ వ్యవస్థ



మొయినాబాద్‌ బస్‌స్టాప్‌లో వాహనాలు పార్కు చేయడంతో నిలిపేసిన ఆర్టీసీ బస్సు

మొయినాబాద్‌: మొయినాబాద్‌లో ట్రాఫిక్‌ సమస్య రోజు రోజుకు పెరిగిపోతుంది. హైదరాబాద్‌-బీజాపూర్‌ జాతీయ రహదారిపైనే వాహనాలను పార్కింగ్‌ చేస్తుండడంతో రద్దీ ఎక్కువవుతుంది. ప్రధాన చౌరస్తాలో వాహనాలు ఎటు నుంచి ఎటు పోతున్నాయో అర్థం కాని పరిస్థితి నెలకొంది. నాలుగు వైపులనుంచి ఒకే సారి వాహనాలు రావడంతో తీవ్ర ట్రాఫిక్‌ సమస్య ఎదురవుతోంది. సిగ్నల్‌ వ్యవస్థ ఏర్పాటు చేసినా దాన్ని వినియోగించడంలేదు. హైదరాబాద్‌ మహానగరానికి అతి చేరువలో బీజాపూర్‌ హైవే ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతుంది. దీంతో ట్రాఫిక్‌ సమస్య నిత్యకృత్యమవుతుంది. ప్రధాన చౌరస్తాలో వాహనదారులు ఎటుపోతున్నారో అర్థం కాని పరిస్థితి నెలకొంది. రహదారికి ఇరుపక్కల ఉన్న షాపులు, హోటళ్లు, బ్యాంకుల ముందు వాహనాలను ఇష్టం వచ్చినట్లు పార్కుచేస్తున్నారు. దీంతో రహదారిపై వెళ్లే వాహనాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

బస్‌స్టాప్‌లో పార్కింగ్‌..

బస్‌స్టాప్‌లో ఆటోలు నిలుపుతుండడంతో ఇక్కడ బస్సులు రోడ్డుపైనే ఆగుతున్నాయి. దీంతో వెనక నుంచి వచ్చే వాహనాలు నిలిచిపోయే పరిస్థితులు దాపురించాయి. అవి కదిలేంత వరకు ట్రాఫిక్‌ నిలిచిపోతుంది. బస్‌స్టాప్‌ల వద్ద బ్యాంకులు ఉండటంతో బ్యాంకుకు వచ్చినవారు, నిత్యం పనుల మీద వచ్చే వారు సైతం వాహనాలను రోడ్డుపైనే నిలుపుతున్నారు. రోడ్డుకు ఇరుపక్కల టీ పాయింట్లు, జూస్‌ బండ్లు, పానిపూరీ బండ్లు ఏర్పాటు చేయడంతో షాపుల ముందు పార్కింగ్‌ స్థలం లేకపోవడం కూడా మరో కారణమే.

అలంకారప్రాయంగా సిగ్నల్‌ వ్యవస్థ..

ట్రాఫిక్‌ సమస్య పరిష్కరించడం కోసం ప్రధాన చౌరస్తాలో సిగ్నల్‌ ఏర్పాటు చేశారు. కానీ ఆ సిగ్నల్‌ వ్యవస్థను వినియోగించడంలేదు. సిగ్నల్‌ ఆపరేటింగ్‌ లేకపోవడంతో ప్రధాన చౌరస్తాలో నాలుగు వైపుల నుంచి ఒకేసారి వాహనాలు వస్తుండడంతో ట్రాఫిక్‌ జాం అవుతుంది. సిగ్నల్‌ ఏర్పాటు చేసినా దాన్ని ఎందుకు వినియోగించడం లేదో ట్రాఫిక్‌ పోలీసులకే తెలియాలి. ప్రతి సోమవారం మొయినాబాద్‌లో సంత ఉండటంతో ఆ రోజు ట్రాఫిక్‌ సమస్య మరింత జఠిలమవుతుంది. ప్రధాన చౌరస్తాలో ట్రాఫిక్‌ చూసుకునేందుకు హోంగార్డు ఉంటున్నా కేవలం ఫొటోలు తీసి చలాన్లు వేయడానికే పని గట్టుకొని ఉన్నట్టుగా వాహనదారులు, స్థానికులు విమర్శిస్తున్నారు. హైవే మొబైల్‌ వాహనం సైతం రహదారిపై తిరుగుతూ ఫొటోలు తీయడమే తప్పా ట్రాఫిక్‌ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవడంలేదు.



ట్రాఫిక్‌ సమస్య తీర్చాలి..

మొయినాబాద్‌లో ట్రాఫిక్‌ సమస్య చాలా ఎక్కువైంది. బస్టాపుల్లో వాహనాలు నిలుపకుండా చూడాలి. రహదారికి ఇరుపక్కల షాపుల ముందు పార్కింగ్‌ ఉండేలా చర్యలు తీసుకోవాలి. ట్రాఫిక్‌ సమస్యకు ప్రధాన కారణమవుతున్న రోడ్డుపక్కనే ఏర్పాటు చేసిన టీస్టాళ్లు, బండికొట్టులు, దుకాణాల సామాన్లు పెట్టడాన్ని పోలీసులు పూర్తిగా తొలగించి ట్రాఫిక్‌ సమస్య తలెత్తకుండా చేయాలి.

– కేబుల్‌ రాజు, మొయినాబాద్‌

కఠిన చర్యలు తీసుకుంటాం..

మొయినాబాద్‌లో ట్రాఫిక్‌ సమస్య ఎక్కువగా ఉందని మా దృష్టికి వచ్చింది. సిగ్నల్‌ వ్యవస్థను కూడా పరిశీలించి ట్రాఫిక్‌ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తాం. రోడ్లపై, బస్‌స్టాప్‌లో వాహనాలు పార్కుచేస్తే చర్యలు తీసుకుంటాం. షాపుల ముందు బండ్లు పెట్టి ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు.

– బోస్‌కిరణ్‌, ట్రాఫిక్‌ సీఐ, రాజేంద్రనగర్‌